క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి, విజయపాల్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దీపికరాజ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగం పరిశోధకురాలు కర్సాన్ దీపిక రాజ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫ్లూయోరెసెంట్ ఇన్ సిటు హైబ్రిడైజేషన్ (ఫిష్) బేస్డ్ క్రోమోసమ్ మ్యాపింగ్ ఆఫ్ ఫంగసీ ట్రెయిట్ ఇన్ చిల్లీ పెప్పర్ (క్యాప్సికమ్ స్పెసీస్) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కర్సాన్ దీపిక రాజ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. బాటనీ విభాగం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రిస్టోఫర్ రుబెన్ పర్యవేక్షణలో దీపికరాజ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సల్ల రఘుకు ఓయూ డాక్టరేట్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రాంతానికి చెందిన సల్ల రఘుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఏ కన్వల్యూషన్ న్యూరల్ నెట్వర్క్ మోడల్ ఫర్ ఆటోమెటిక్ సెగ్మెంటేషన్ ఆఫ్ బ్రెయిన్ ఎమ్మారై ఇమేజెస్ అనే అంశంపై వాసవి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టీ.ఆదిలక్ష్మి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ అందుకున్నారు. మంగళవారం జరిగిన ఓయూ స్నాతకోత్సవం సందర్భంగా అతిథుల నుంచి డాక్టరేట్ పట్టాను రఘు అందుకున్నారు. కాగా, ఆయన కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

ఈగ మల్లేశానికి సన్మానం

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు బీఆర్ఎస్ సమన్వయకర్తగా నియమితులైన ఈగ మల్లేశంను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. హనుమకొండ బాలసముద్రంలోని స్వగృహంలో బీఆర్ఎస్ నాయకుడు మాడిశెట్టి శివశంకర్, నాయకులు కలిసి ఈగ మల్లేశంను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమన్వయంతో ముందుకు సాగాలని మల్లేశం సూచించారు.

అలరించిన దివ్యాంగులు

కాజీపేట: ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులైన నిరుద్యోగ కళాకారులు గురువారం సాయంత్రం కాజీపేట చౌరస్తాలో పాటలు పాడుతూ బాటసారులను ఉత్తేజపరిచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దివ్యాంగులు శ్రీ సాయి ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ఆర్కెస్ట్రా బృందాన్ని ఏర్పాటు చేసి భక్తి పాటలు, జానపద గేయాలు, సినిమా పాటలను పాడుతూ మైమరిపించారు.

కార్మిక సంఘం నాయకుడి కుటుంబానికి చేయూత

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ మహంకాళమ్మ వీధికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ కార్మిక సంఘం నాయకుడు టీ.సంజీత్ కుటుంబ సభ్యులకు శ్రీధర్మశాస్త్ర పరపతి సంఘం, కౌండిన్య పరపతి సంఘం సభ్యులు రూ.35 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బుర్ర జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు చేయూతనందించారు. కార్యక్రమంలో ఆవాల పురుషోత్తం రెడ్డి, పిల్లల కుమారస్వామి, అరూరి సాంబయ్య, బొమ్మెర విజయ్, కొండ రాజేందర్, బస్కె దశరథం, భద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిని దాటుతున్న జపాన్ అనే వ్యక్తిని బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ సంఘటన గురువారం ఉదయం వరంగల్ హంటర్‌రోడ్డు ఉర్సుగుట్ట సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కరీమాబాద్‌కు చెందిన జపాన్.. ఉదయం ఉర్సుగుట్ట ప్రాంగణంలో వాకింగ్ వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో రహదారిని దాటుతుండగా ఓ బైక్ అతన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

కబడ్డీ క్రీడాకారుడి మృతి



పున్నం (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారానికి చెందిన జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు ముచ్చ పున్నం (46) అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందాడు. కబడ్డీతో పాటు కుంగ్‌ఫూ, కరాటేలోనూ రాష్ట్ర, జిల్లాస్థాయిలో పోటీల్లో పాల్గొని పున్నం ప్రతిభ కనబరిచారు. ఆయన మృతిపై స్థానికులు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్



మాట్లాడుతున్న అరూరి రమేష్

హసన్‌పర్తి: ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీ సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ పిలుపునిచ్చారు. కేఎల్ఎన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఓటరు వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను వివరించాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వేలు అన్ని బీఆర్ఎస్ వైపే ఉన్నాయన్నారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు సత్యప్రసాద్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, రైతు బంధు కోఆర్డినేటర్ విజయ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్ పాల్గొన్నారు.

అండగా ఉంటా.. దీవించండి

- వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాయిని రాజేందర్



54వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు

నయీంనగర్: ప్రజలకు అండగా ఉంటానని, చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయిని 54వ డివిజన్‌లో ప్రజా దీవెన పాదయాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో చెబుతూ, 6గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. బీఆర్ఎస్ పాలనలో వరంగల్ నగరం 20ఏళ్ల వెనక్కి వెళ్లిందని చెప్పారు. తాను గెలిచిన వెంటనే డబుల్ బెడ్రూం రూం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంటరీ అబ్జర్వర్ రవీంద్ర ఉత్తంరావు దాల్వి, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ పులి అనిల్‌కుమార్, రహీమున్నీసా బేగం పాల్గొన్నారు.

‘తూర్పు’లో అభివృద్ధి శూన్యం

- వరంగల్ తూర్పు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



ప్రచారం చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి చెందకపోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కారణమని బీజేపీ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. 19వ డివిజన్ కాశిబుగ్గ, వివేకానంద కాలనీ, సొసైటీ కాలనీల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి.. ఓటమి అనంతరం నియోజకవర్గ ప్రజలకు కనిపించకుండా పోయారని ఎద్దేవాచేశారు. ఇప్పుడు వచ్చి అండగా ఉంటానంటూ కల్లబొల్లి కబుర్లు చెపుతున్నారని విమర్శించారు. కాశిబుగ్గ, సొసైటీకాలనీ, వివేకానందకాలనీలు ప్రతీ ఏడాది వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతుండగా ఐదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తనకు ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని ప్రదీప్‌రావు అన్నారు. డాక్టర్ వెంకటరమణ, పరమేశ్వర్, హరిశంకర్, ఎరుకుల రఘునారెడ్డి, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే బీజేపీని గెలిపించాలి



ప్రచారంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

- పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మ

హన్మకొండ: వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేసే బీజేపీని గెలిపించాలని బీజేపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాజేశ్వర్ రావు అన్నారు. హనుమకొండ 5, 52వ డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ వరంగల్ పశ్చిమ అభ్యర్థి రావు పద్మ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరగా రావు పద్మ వారికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చాడ స్వాతి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొలను సంతోష్ రెడ్డి, దేశిని సదానందం గౌడ్, కందగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- తూర్పు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సురేఖ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా సురేఖ

కాశిబుగ్గ: దేశంలో, రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. 19వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హనుమకొండ కొండా సురేఖ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. వారికి సురేఖ, మురళి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పొన్నాల సంపత్, ఒంటిల కిరణ్, మేకల సురేష్, మంద సంపత్, చింత రాజు, పోశెట్టి, వినయ్, విక్రమ్, లక్ష్మి, శారద తదితరులు చేరారు.

‘దాడులు చేస్తున్న ఎమ్మెల్యే’

కాశిబుగ్గ: తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని చూపించాలని అడిగిన ప్రతిసారి దాడులకు పాల్పడుతూ.. రౌడీయిజం, గుండాగిరి చేస్తున్నారని కాంగ్రెస్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె 35వ డివిజన్‌లో ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే నరేందర్ నియోజకవర్గంలో హంగు ఆర్భాటం, దౌర్జన్యం, కబ్జాలు తప్పితే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. చిన్న వర్షానికే డివిజన్, నగరం వరదమయంగా మారుతోందని శాశ్వత పరిష్కారమేది అని ఆమె ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ప్రచారం నిర్వహిస్తుండగా కొండా సురేఖ అస్వస్థతకు గురవడంతో కొండా మురళి ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేణుకుంట్ల శివకుమార్, మీసాల ప్రకాశ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎండీ చాంద్ పాషా, పోలేపాక ఏసు, దాసరి రాజేశ్, సునీత పాల్గొన్నారు.

గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: తనను మరోసారి గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తానని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. చిరు వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోకా జంక్షన్ నుంచి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు చిరు వ్యాపారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కాజీపేట నుంచి హనుమకొండ వరకు 6 వేల మంది చిరు వ్యాపారులున్నారని, వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉన్నానన్నారు. చిరు వ్యాపారుల సంఘం నాయకుడు ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు ఖుద్దుస్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు సత్తార్, ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు హరిచంద్రు, రాహుల్, సర్వర్, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని న్యూరాయపుర కంచరవాడలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. లక్కాకుల కుమార్, చాడ వెంకటేష్, లింగాల నరేష్, నలుబోలు కార్తీక్ ఆధ్వర్యంలో 8, 9వ డివిజన్లకు చెందిన సుమారు పలు పార్టీల నుంచి యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ ఖాజాసిరాజుద్దీన్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, సిరిమల్లె సదానందం శీలం ప్రవీణ్, చింతాకుల ప్రభాకర్, సిద్దంశెట్టి శ్రీనివాస్, తుల రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సహకరించే వారికే సీపీఐ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: గుడిసెవాసుల అభివృద్ధికి సహకరించే వారికే సీపీఐ మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనంలో గడ్డం యాకయ్య అధ్యక్షతన గుడిసెవాసుల సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించాలని కోరారు. గుడిసెవాసుల కాలనీల్లో విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, అలాంటి వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, పంజాల రమేష్, ఎస్‌కే.బాషుమియా, అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, గుంపెల్లి మునీశ్వరుడు, వీరగోని శంకరయ్య, గుండె బద్రి, ఆరెల్లి రవి, కందిక చెన్నకేశవులు, దామెర కృష్ణ, జన్ను రవి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

కాజీపేట అర్బన్: బీఆర్ఎస్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. న్యూశాయంపేట, బొల్లెనవాడ, తూర్పువాడ, ఎస్సీ కాలనీ, రాసమల్ల వాడ, పద్మశాలి భవన్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, మాడిశెట్టి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం

కాజీపేట: వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ యువజన విభాగం కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫర్హాన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, కల్పలత సూపర్ బజార్ డైరెక్టర్ అయ్యాల దానం, డివిజన్ ఇన్‌చార్జ్ నజీరుద్దీన్, రజాక్, షుకుర్, ముజాహిద్, సహిద్, సాదిక్, ఫరూక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్ అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

నయీంనగర్: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ తీరని అన్యాయం చేసిందని, ఆ పాపాల్లో భాగస్వామ్యం కాలేక ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ మాజీ డైరెక్టర్, లాయర్ కంప వినోద్‌కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు ఒక్క కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు రూ.5లక్షల కోట్ల అప్పు మిగిలిందని అన్నారు. నీళ్ల పేరిట కట్టిన ప్రాజెక్టులు కూలుతున్నాయని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. సిరిసిల్ల నియోజకవర్గానికి రూ.400కోట్లు, సిద్దిపేటకు రూ.700కోట్లు, గజ్వేల్‌కు రూ.540కోట్లు ఇచ్చారని అన్నారు. పేదల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని వివరించారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



కరీమాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. గ్రేటర్ పరిధిలోని రంగశాయిపేట ఆర్ఆర్ గార్డెన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ తోడ్పాటుతోనే చర్చీల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కాగా, పాస్టర్ జేమ్స్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాస్టర్లందరు కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మంతెన సునీత, నాగరోని మురళి, ఇటికాల అశోక్, కత్తెరశాల వేణుగోపాల్, శ్యామ్, సన్నీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మడికొండ: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ విజయానికి ప్రతీకార్యకర్త ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్ కోరారు. డివిజన్‌లో బూత్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి మోహన్, బోగి లింగమూర్తి, పేపర్ రవీందర్, రొయ్యల లక్ష్మణ్, ముప్పిడి శివ, కందగట్ల సుదర్శన్, ఉల్సి రవీందర్, అల్లం శ్రీనివాస్, క్యాట్ సతీష్, బోగి రాజు, పోశాలు, బండారి మహేందర్, రమేష్, కుమార్, కిషన్, నితిన్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన ర్యాలీలో అధికారులు, వైద్య సిబ్బంది

ఎంజీఎం: ఓటు అనేది చాలా విలువైందని, ప్రతీఒక్క ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ వడ్డెపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు.. ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తుందని వివరించారు. ఐఎంఏ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకుబ్‌పాషా, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

వరంగల్: వరంగల్ గ్రేటర్ 14వ డివిజన్ ఏనుమాముల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏనుమాముల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్, ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని ప్రచారం చేసుకోవాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాయకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అడుప మహేష్, ప్రధాన కార్యదర్శి ఎండీ.జావిద్, వల్లకొండ తిరుపతి, జంపయ్య, సంతోష్, ఏకాంబరచారి, శివ పటేల్, గంధం కుమారస్వామి, మధు, కుమార్, అఫీజ్, ఎండీ.శంశోద్దీన్, యాకుబ్ పాల్గొన్నారు.

‘యుద్ధభేరి’ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ ఖన్నా

హన్మకొండ: హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఈనెల 5న జరగనున్న మాదిగల యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఇల్లందు రాజేష్ ఖన్నా మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు, తర్వాత మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధిక సంఖ్యలో మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి యోబు, నాయకులు కట్టెపుల ప్రశాంత్, మధు, గంగారపు యశ్వంత్, గిన్నారపు అనిల్‌కుమార్, సంజీవ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాశిబుగ్గ: బీఆర్ఎస్‌కు చెందిన పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు, 21వ డివిజన్‌కు చెందిన ఆకెన వెంకటేశ్వర్లు బీజేపీలో చేరారు. ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్వర్లుతో పాటు మరో పలువురు కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఉద్యమకారులు, సీనియర్ నాయకులకు గుర్తింపు లేదని వాపోయారు. దాంతో బీజేపీలో చేరినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో గాదె భిక్షపతి, గోరంటల రాజేష్, ఆకెన కిరణ్, చేరాల వెంకటేశ్వర్లు, లింగబత్తిని రాము, దాసి రాజు, గాదె రాజు, గాజర్ల మధు, బండారి నరేష్, దేవులపల్లి రాకేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

నేత్రదానంతో అంధత్వ నివారణ



అంగీకార పత్రం అందిస్తున్న కుటుంబ సభ్యులు

ఎంజీఎం: నేత్రదానంతో అంధత్వ నివారణకు తోడ్పడుదామని నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొంద్రు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి మండలం గట్ల దామర గ్రామవాసి కందుకూరి రామ్మూర్తి (64) ప్రమాదానికి గురై మృతి చెందగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుడి నేత్రాలను గురువారం దానం చేసినట్లు తెలిపారు. నేత్రాలను వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణులు సేకరించినట్లు వివరించారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులు కుమార్తె శిరీష, అల్లుడు రాజేష్, సోదరులు వెంకటరమణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమేష్, మేనల్లుడు సురేష్.. మరణానంతరం నేత్రదానం చేసేందుకు అంగీకరించినట్లు మల్లారెడ్డి తెలిపారు.

శ్వేతార్కుడికి ప్రత్యేక అలంకరణ



కాజీపేట: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం రాత్రి పూలతో ప్రత్యేక అభిషేకం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి సహస్రధారలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ గాయకుల భక్తిరస పాటలు అలరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో స్వామి వారికి ఊంజల సేవతో పాటు దర్బారు సేవ నిర్వహించారు. పూజలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ, రాధాకృష్ణ శర్మ, సాయి కృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, మేనేజర్ రవి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని షిర్డి సాయిబాబాకు ఆలయ పండితులు గురువారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో శ్వేతార్కుడితో పాటు 29 దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. నూతన పట్టు వస్త్రాలను అర్చకులకు భక్తులు అందించగా, వాటితో సాయిబాబాను అలంకరించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నపూర్ణ కేంద్రంలో అన్నదానం చేశారు.